
# కారం కారం కథా ప్రభ




## నాటి కథ :-

ఒకానొక ఊళ్లో ఒక రైతుండేవాడు. ఓ ఏడాది కరువొచ్చి రైతుల బతుకులు అధ్వాన్నపు అడవు లయిపోయాయి. అప్పులు పుట్టడం గగనమై పోయింది. ఈ రైతు దగ్గిర ఓ గాడిద మాత్రం మిగిలింది అన్నీ అమ్ముకు తినగా. గత్యంతరం లేక దాన్ని కూడా అమ్మాలని నిర్ణయించుకున్నాడు. చివరికి ఓ రోజున పెద్ద కొడుకుని తోడు తీసుకుని, పదిమైళ్ల దూరాన జరిగే సంతకి గాడిదని తోలుకుంటూ బయలు దేరాడు. కొంత దూరం వెళ్లాక ఓ ఆసామీ ఎదురై వాళ్లవైనం తెలుసుకుని, "మీ భూతదయ దొంగల్తోలా! గాడిదంటే బరువులు మోసేది అని అర్థం. దాన్ని ఖాళీగా వదిలి మీరు నడవడ మేమిట్రా వెర్రి సన్నాసులూ! ఎవరో ఒకళ్లు ఎక్కి కూర్చోండి. అవసరమైతే కూర్చునే డ్యూటీ మార్చుకోండి!" అని ఫలహా ఇచ్చి వెళ్లి పోయాడు. ఆ సలహా పాటించి కొడుకుని గాడిద ఎక్కించి, తాను అనుసరించాడు రైతు. ప్రయాణం సాగుతోంది.

## నేటి కథ :-

స్వర్ణముఖేశ్వరరావుగారు చిన్నవాడేం కాదు. అగస్త్య మహాముని మహా సముద్ర జలాలు మొత్తాన్ని పుడిసిట దొరక బుచ్చుకుని ఆపోసన పట్టేసినట్లు, నవల, కథ, నాటక, కవితా ప్రక్రియలకి సంబంధించిన థియరీస్‌నీ, టెక్నికాలిటీస్‌ని ఏనాడో గుటుక్కున మింగేసి జీర్ణం చేసుకున్న మేధావి శ్రీమాన్ ఎస్సెమ్ రావు గారు. సాహిత్య ప్రపంచంలో



# కొత్త ఊపిరి

శ్రీ రామమోహన శాస్త్రి

లబ్ధప్రతిష్ఠులు. ప్రస్తుతం ఆయన రచన లేకుండా ఏ పత్రికా బైట పడ్డంలేదు.

మేమిద్దరం కలిసి ఆ ఖరీదైన హోటల్ రూఫ్ గార్డెన్‌లో ఓ టేబిల్ ముందు కుర్చీల్లో సెటిలయిన చాలాసేపటికి ఎస్సెమ్ రావుగారు పెదవి విరిచాడు. ఆ తరవాత ఓ సిగరెట్టు ముట్టించి గట్టిగా రెండు దమ్ములాగి గాల్లోకి వదిలాడు. నావైపు చూశాడు. సదరు చూపు అదో రకంగా ఉంది. అది సోకగానే నాకు ఏవిటోగా అనిపించింది. ఆ 'అదో'నీ, ఈ 'ఏవిటో'నీ వివరించడం నావల్ల గావడం లేదు.

"ఆ మధ్య నువ్వు ఇచ్చి వెళ్లిన కథ చదివానోయ్ గంగాధరం! సాధారణంగా నాకు తీరుబాటు దొరకడమే కష్టం. చదివి మీ అభిప్రాయం చెప్పండని చాలామంది వస్తూ ఉంటారు. కాగితాల కట్టలు ఇచ్చిపోతూ ఉంటారు. నేనెంత బిజీ మనిషినో వాళ్లకేం తెలుసు? ఎవడి స్వార్థం వాడిది! తమ పనయిపోతే చాలునన్నట్లు వెంపర్లాడుతూ ఉంటారు. లోకం తీరోయ్, లోకం తీరు!" అన్నాడు ఎస్సెమ్ రావు.

పెద్దవాడు, అనుభవజ్ఞుడు కాబట్టే అందర్నీ జమిలిగా కుళ్లబొడుస్తున్నాడు. ఆ అందర్లో నేను కూడా ఒకణ్ణి. నాలాగే పౌరుషం ఉండే ఉంటుంది. కాని పౌరుషానికి పడి ఏ ఒక్కడూ కౌంటర్ చేసిన దాఖలా ల్లేవు. అదే జరిగి ఉంటే ఆయన ఇలా నా ముందర 'సామూహిక ఉతుకుడు' కార్యక్రమం మొదలెట్టేవాడు కాడు. చెప్పొచ్చేదేమిటంటే చాలా కాలం విరామం తరవాత ఈ మధ్యనే ఓ కథ రాశాను. ఈ కథలో సోషియల్ అవేర్‌నెస్‌లూ, ఇజాలూ గట్రా ఏవఁన్నా ఉన్నాయో లేవో నాకు తెలీదు. తేల్చుకోలేకపోయాను. అట్టి పరిస్థితుల్లో నేను బరికిన ఆ కథని గురుతుల్యులైన ఎస్సెమ్ రావుగారి చేతుల్లో పెట్టి, అభిప్రాయంతోపాటు నా అభివృద్ధికి పనికొచ్చే సలహాలూ, సూచనలూ ఇవ్వమని కోరాను. ఇప్పటికి ఒక పది సార్లన్నా ఆయన ఇంటి చుట్టూ తిరిగి ఉంటాను. కాని ఆయన వాయిదాలు వేస్తూ వచ్చారు. ఇప్పటికి నా కోరిక నెరవేరబోతోంది.

ఆయన ఏదో అనబోతుంటే బేరర్ వచ్చి కాఫీ కప్పులు మా ముందుంచి వెళ్లాడు.

ఎస్సెమ్ రావుగారు కాఫీని రెండు సిప్పులు సిప్పి, 'చూడవోయ్ గంగాధరం! రాశామంటే రాశామని పెన్నుకి క్యాప్ పెట్టేసి, కాగితాలకి పిన్ను పెట్టేసి, ఆనక చంకలు గుద్దుకోవడం కాదోయ్! ఎందుకు రాశాం, ఏం రాశాం, ఓ శైలీ, శిల్పం ఉన్నాయా, లేవా అని ఒకటికి పదిమార్లు చూసు కోవాలి. రాసింది రాసినట్టుండదు. అచ్చులోకి వెళ్లిపోతుంది. అంటే చాలాకాలం పాటు మిగిలి పోయే స్థితికి చేరుతుందని మర్చిపోకూడదు. రచన అంటే సామాన్యం కాదు" అన్నాడు. సాలోచనగా శూన్యంలోకి చూడసాగాడు. చూస్తూనే కాఫీ తాగేశాడు. మరో సిగరెట్టు ముట్టించి గుండెనిండా పొగపీల్చి గుప్పున గాల్లోకి వదిలాడు.

నేనూ ఒక సమిధ వెలిగించుకున్నాను.


"నీ కథలో జీవితం సరిగా కనిపించలేదు గంగాధరం! ఒట్టి 'జీతం' మాత్రం కొట్టొచ్చినట్లు కనిపించింది. జీవితం లేని కథ ప్రాణం లేని శరీరం లాంటిది" అన్నాడు ఎస్సెమ్ రావుగారు.

"అలా గాలి తీసేస్తున్నారేంటి గురూగారూ! ఒక నిజాయితీపరుడైన సామాన్య ఉద్యోగికి సంబంధించినంత వరకు జీతానికీ, జీవితానికీ విడదియ్యలేని బంధం. అసలు రెంటినీ విడదీసి చూడ్డానికే వీలు పడదు. జీతం కొట్టొచ్చినట్లున్నదని మీరే అన్నారు. వాడి జీవితం కూడా పక్కనే ఉన్నది గదా-మీరు చూసే ఉండాలే!" అన్నాను కొంచెం ధైర్యం చేసి.

"చూశాను. కాని ఏమున్నది అందులోంచి ప్రపంచం నేర్చుకునేది? అవకాశాలొచ్చినా పిల్లల్ని పెద్ద చదువులకి పంపించే స్తోమతు లేక లోలోపల కుళ్లిపోవడం, ఆడపిల్ల పెళ్లికి అప్పులు చేసి, వడ్డీలు కట్టలేక, కడితే జీతం చాలక గిజగిజలాడ్డం, ఇవి చాలవన్నట్లు తన వెనక సర్వీసులో చేరిన వాళ్లంతా - "ఖాళీ జాగాలు వేలంపెట్టి అమ్ముకునే వ్యాపారం చేస్తున్న గవర్నమెంటు సంస్థ" ద్వారా స్థలాలూ, ఇళ్లూ కొనేసుకున్నందుకు కుంగిపోవడం, తను కోట్ చేసిన రేటుకి జాగా ఎలాట్ కాక, జాతక చక్రం పట్టుకుని జ్యోతిష్కుల చుట్టూ తిరగడం, పైగా ఆ జాగాలమ్ముకునే వ్యాపార సంస్థ ఏ ఎంక్వయిరీలూ చెయ్యకుండా డబ్బున్న వాళ్లకీ, రెండేసి మూడేసి స్థలాలున్న వాళ్లకే మళ్లీ అమ్ముతూ అసలు లేనివాళ్లని నిర్లక్ష్యం చేస్తున్నారని పత్రికల్లో ఉత్తరాలు రాసి ఆనందించడం... ఇదటయ్యా కథ? పైగా అతగాడెవరు? అవినీతి బురద ఒళ్లంతా పులుముకుని బోర విరుచుకు తిరుగుతున్న ప్రభుత్వోద్యోగ వర్గానికి చెందినవాడు. ప్రజల్లో పిసరంత గౌరవం లేని వర్గానికి చెందినవాడు. వాళ్ల గురించి రాసి ఏం సాధిస్తావయ్యా నువ్వు? ఇలాంటి కథలు ఎవడు చదువుతాడు?" అన్నాడు ఎస్సెమ్ రావు ఆవేశంగా.

"గురూగారూ! సమాజంలో అవినీతి వేళ్లు తన్నిందనడం నిజం. ఎక్కడ బడితే అక్కడే ఉంది. కాదనను. కాని అందరూ అవినీతిపరులని ఎలా చెప్పగలం? నీతి, నిజాయితీ ఉన్నవాళ్లు లేరంటారా? వాళ్లని గురించి రాయడం తప్పంటారా?" అనడిగాను.

"పిచ్చివాడివోయ్ గంగాధరం! అలాంటి కథలకి బొత్తిగా గిరాకీ లేదు. పత్రికల వాళ్లకీ నచ్చవు! పాఠకులకీ రుచించవు. అంచాత నీకేమీ




గిట్టుబాటు కాదు" అంటూ ఎస్సెమ్‌రావుగారు, నిత్యం విమర్శకుల నోళ్లల్లో నానుతూండే కొన్ని గొప్ప రచనల్నీ, గొప్ప రచయితల్నీ ఏకరువు పెట్టి, అవన్నీ నన్ను చదవమన్నాడు. అట్టి గొప్ప రచనలు ఈనాడు రావటం లేదని డెందంలో కుంది పోయాడు.

"నలుగురూ మెచ్చే కథ రాయవోయ్... పైకొస్తావు!" అని నా భుజం తట్టాడు.

"థాంక్యూ గురూగారూ! తప్పకుండా ప్రయత్నిస్తాను." అన్నాను. ఆయన అందించిన కథ అందుకున్నాను.

ఇద్దరం లేచాం.

## నాటి కథ :-

అట్టి విధంగా ముసలి రైతు కొంత దూరం, కొడుకు కొంత దూరం గాడిద సవారీ చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్నారు. సగం దూరం గడిచింది. సరిగ్గా అప్పుడు ఓ పెద్ద మనిషి ఎదురై ఆ తండ్రీ కొడుకుల్నీ, వాళ్ల గాడిదనీ మార్చి మార్చి చూసి, వాళ్ల వివరం అడిగి తెలుసుకున్నాడు.

"మీ తెలివి తగలేసినట్టే ఉంది. ఈ వెర్రి ముండని అమ్ముదామని సంతకి తీసుకుపోతూ, ఒకడి తరవాత ఒకడు దాని మీదెక్కి తొక్కి హింస పెడుతున్నారేంటి? సంతకి చేరేసరికి దాని ప్రాణాలు కడబట్టిపోవూ? ఈసురోమనే దాన్ని ఎవడు కొంటాడయ్యా? ఇప్పటిదాకా పెట్టిన చిత్రహింసలు చాలు గాని, ఈ కాస్త దూరం మోసుకు పొండి. అది కాస్త తేరుకుంటుంది. మంచి బేరం వస్తుంది" అని సలహా ఇచ్చాడు. గాడిద నాలుగు కాళ్లనీ కలేసి తాడుతో కట్టారు. మధ్యనుండి ఓ సరుగుడు కర్ర దూర్చి, దాని కొసలు భుజానేసుకుని మోసుకుని పోసాగారు.

## నేటి కథ :-

ఆ రాత్రి భోజనాలయ్యాక సిగరెట్టు కాల్చుకుంటూ వరండాలో పచార్లు చేస్తున్నాను. అట్టి సమయంలో మెదడులో మెరుపులా ఓ ఆలోచన తళుక్కుమంది. కథా వస్తువు బాగానే అనిపించింది. మరి కాస్సేపు తంటాలు పడి, లోలోపలే ప్లాటు సిద్ధం చేసుకున్నాను. తృప్తిగా ఉంది.

హడావుడిగా వంటింట్లోకి వెళ్లి, "పార్వతీ! కథ రాసుకోవాలి. ఫ్లాస్కులో టీ పోసి ఉంచు. పూర్తి చేసిగానీ పడుకోను. అధమ పక్షం రెండు గంటలవుతుంది" అన్నాను.

పార్వతి సన్నగా నవ్వింది. ఆ నవ్వంటే నాకు చాలా ఇష్టం. మిక్కిలి అందంగా ఉంటుంది - మామూలుగా. రాత్రి తొమ్మిది గంటల తరవాత ఆ నవ్వే బహు మిక్కిలి అందంగానూ, విలక్షణంగానూ కనిపిస్తూ ఉంటుంది. ఆ ముఖంలోకి పరిశీలనగా చూశానూ అంటే కథమీద కూచోడానికి మంగళ హారతి పాడేసి ఆవిడ పక్కన కూచుండిపోయే ప్రమాదం తప్పదని తెలుసు నాకు. అందుకే మరోవైపు చూస్తూ, "నవ్వులు తరువాత! ముందు టీ సంగతి చూడు" అనేసి ముందు గదిలోకి వెళ్లాను.

మొత్తంమీద తెల్లారుఝాము మూడు గంటలయ్యేసరికి కథ పూర్తి చేసి భారం దింపుకున్నాను. సిగరెట్టు ముట్టించి గట్టిగా రెండు దమ్ములాగి గాల్లోకి వదిలాను. రిలాక్స్ అవుతున్నాను.

పార్వతి వచ్చింది ఆవలిస్తూ.

"అప్పుడే లేచావేమిటి పార్వతీ?" అనడిగాను.

"అసలు పడుకున్నదెప్పుడు!" అంది పార్వతి.

"అదేవిఁటి?"

"నిద్దరపట్టి చావలా! అటూ ఇటూ దొర్లడమే సరిపోయింది. పక్కన మీరుంటే కాలో చెయ్యో మీమీద వేస్తూ ఉండేదాన్ని. మీరేమో అర్ధరాత్రీ, అపరాత్రీ లేకుండా దూరంగా నెట్టేస్తూ, విసుక్కుంటూ ఉంటే హాయిగా నిద్దర పట్టేది. కానీ ఈ పూట... విశాలమైన డబుల్‌కాట్ మీద సింగిల్ మనిషిని..." అని నవ్వింది పార్వతి, బహు మిక్కిలి అందంగా, విలక్షణంగా.

నాకూ నవ్వొచ్చింది. నవ్వాను.

"మీరు వెళ్లి ముఖం కడుక్కురండి. వేడిగా హార్లిక్స్ తెస్తాను" అంటూ పార్వతి బైటికి నడిచింది.

లైటార్పి అనుసరించాను.

❋ ❋ ❋

ఆదివారం ఉదయం పదిగంటలు కావస్తోంది.

నేను వెళ్లే వేళకి సుప్రసిద్ధ కథా రచయిత, విమర్శకులు నంజుండయ్య హాల్లోనే సోఫాలో కూచుని పుస్తకం ఏదో తిరగేస్తూ కనిపించాడు.

"రావోయ్ గంగాధరం! కూర్చో!" అన్నాడు.

"ఈ మధ్య బాగానే రాస్తున్నావట! మన శివరాజులు చెప్పాడు. స్వర్ణముఖం గాడింటి దగ్గిర నీ కథ చూసి చదివాడట. మంచి కథ అన్నాడు. చదివి అభిప్రాయం చెప్పమని స్వర్ణముఖానికి ఇచ్చావట గదా? ఏవఁన్నాడేమిటి?" అనడిగాడు నంజుండయ్య, సిగరెట్టు ముట్టిస్తూ.

క్షణకాలం తటపటాయించాను. చెబితే వచ్చే నష్టాలు, చెప్పకపోతే ఒళ్లో పడే లాభాలూ లేవని నిర్ధారించుకుని, 'ఆ కథలో జీవితం కన్న జీతం గొడవే ఎక్కువగా కనిపించిందన్నారు, గురూగారూ!' అని జవాబిచ్చాను.

"వాడిమొహం! జీతం మీదే ఊపిరి పీల్చుకునే వాడి జీవితంలో జీతం గొడవ ఉండక మరే ముంటుంది? అయినా స్వర్ణముఖంగాడిది కడుపు నిండిన బేరం. పెళ్లాం తెచ్చిన లక్షల ఆస్తి ఉంది. పైపెచ్చు రెండు చేతులా సంపాదన ఉన్న ఉద్యోగం! ఏమైనా అంటాడు" అన్నాడు నంజుండయ్య కసికసిగా.

ఆయనకీ, ఈయనకీ రచయితలుగా ప్రొఫెషనల్ రైవల్రీ! కొన్ని పత్రికలకి ఆయనా, కొన్నింటికి ఈయనా వతన రైటర్లు. ఇందులో పైచెయ్యి ఎవరిదో చెప్పటం కష్టం. ఒక్కొక్క సారి వ్యాసాల ద్వారా ఒకళ్లనొకళ్లు చిత్రిక పట్టుకుంటూ ఉండటం మామూలు. ఎప్పుడన్నా సాహిత్య సమావేశాల్లో ఎదురైతే మహాప్రేమగా కావిలించేసుకుంటారు.

"కొత్త కథ ఏదన్నా రాశావా?" అనడిగాడు ప్రేమగా నంజుండయ్య.

"అవును గురూగారూ! మీ కిచ్చిపోదామని వచ్చాను. మీకు వీలు పడ్డప్పుడు చదివి అభిప్రాయం చెప్పండి. సలహాలివ్వండి!" అంటూ కథ అందించబోయాను.

"ఇప్పుడు ఖాళీగానే ఉన్నాను గంగాధరం! తాపీగా చదివి వినిపించు" అంటూ, కాఫీ తెమ్మని భార్యకి పురమాయించాడు.

కాఫీలు తాగాం.

నేను కథ చదవసాగాను.

(టూకీగా కథ సారాంశం ఇది :- ఎక్స్, వై బాల్య మిత్రులు. ఒకే ఆఫీసులో పని చేస్తున్నారు. ఎక్స్ సంసార పక్షం మనిషి. వై ఆడంబరాలకు ఎగబడే మనిషి. అవసరాలు ఎక్కువ. అప్పులూ ఎక్కువే చేసేవాడు. ఓ మారు ఓ ఋణదాతగారు వై ని రోడ్డుమీద చొక్కా పట్టుకుని నిలబెట్టి, నించున్న పళాన డబ్బు కక్కమని నిర్బంధిస్తే అతని బాధ చూళ్లేక, తెలిసినవాడి దగ్గర అప్పుతెచ్చి వై పరువు నిలబెట్టాడు ఎక్స్. సంవత్సరాలు గడుస్తున్నా వై ఆ డబ్బు తిరిగివ్వటానికి ప్రయత్నించక పోయేసరికి, పరువు పోతుందన్న భయంతో ఎక్స్ తనే అప్పు తీర్చేశాడు. కొంత కాలానికి ఎక్స్ గారి చిన్న కొడుక్కి పాలిటెక్నిక్‌లో సీటొచ్చి, ఫీజు కట్టడానికి డబ్బు చాలక వెళ్లి వై ని అడిగాడు. కాని అతనూ, అతని భార్యా కలిసి ఎక్స్‌ని దుమ్మెత్తి పోశారు. బిక్కచచ్చిపోయి తిరుగు ముఖం పట్టాడు ఎక్స్. ఇదిలా ఉండగా అదే ఆఫీసులో జడ్ అని వాచ్‌మన్ ఉన్నాడు. రోగిష్టివాడు. ఇంటినిండా లుకలుకలాడుతూ పిల్లలు. జీతం చాలక నెలాఖర్లో తెలిసిన వాళ్ల దగ్గిర అయిదూ పదీ అప్పు చేసేవాడు. అతనిలో సుగుణం ఏమిటంటే జీతం అందగానే ఆ అప్పులు పైసల్తో సహా-అడక్కపోయినా-తిరిగి చెల్లించేవాడు. ఓమారు పది రోజులు సెలవు పెట్టి ఆసుపత్రి చుట్టూ తిరిగాడు. కాన్సర్ అని తేల్చారు డాక్టర్లు. అడ్మిట్ అయి పొమ్మన్నారు. అడ్మిట్ అవడానికి హాస్పిటల్‌కి వెడుతూ ఎక్స్ ఇంటికి వచ్చి అతనికి ఇవ్వాల్సిన మూడు రూపాయలు ఇచ్చేసి, 'కాన్సర్‌తో ఆస్పత్రికి వెడుతున్నాను. తిరిగొస్తానని నమ్మకం లేదు. మీ బాకీ చివరిది తీర్చేశాను. ఇప్పుడు నేనెవరికీ బాకీ లేను. చాలా సంతోషంగా ఉంది. హాయిగా చచ్చిపోతా సార్' అని వెళ్లాడు. అలా వెళ్లిన జడ్, వారం తిరక్కుండానే పోయాడు. లోకంలో నిజాయితీయే చచ్చిపోయినట్లనిపించింది ఎక్స్‌కి.)

పది పేజీల కథని ప్రశాంతంగా విన్నాడు నంజుండయ్య.

"కథ ఇంటరెస్టింగ్‌గా ఉందోయ్ గంగాధరం! మధ్య మధ్య నువ్వు చేసిన విశ్లేషణలు మాత్రం డెకొరేటివ్‌గా, బోరింగ్‌గా ఉన్నాయి. ఆవగింజంత కథా వస్తువు కోసం ఇంత భారీ శ్రమ దేనికి? ఇంతా శ్రమ పడితే వచ్చేది వందో, యాభయ్యో! సిగరెట్ల ఖర్చుకి కూడా సరిపోదు. ఆధునిక పాఠకుల స్థాయికి అందేలాగా రాయాలయ్యా! వాళ్లు ఎనాలిసిస్‌లు భరించలేరు. కథలో ఎక్కడన్నా ఏడెనిమిది లైన్ల పేరాలు కనిపిస్తే వాటిమీంచి జంప్ చేసి, అక్కణ్ణుంచి చదువుతున్నారు. ఈజీ అండ్ ఫాస్ట్ రీడింగ్‌కి అలవాటు పడ్డారు. అసలు ఇదంతా కాదు. ఎంత ప్రతిఫలం రావటానికి అవకాశం ఉందో చూసుకుని దాన్ని బట్టి రాయడం మొదలెట్టాలి. అర్థమైందా?" అన్నాడు.

"అర్థమైంది గురూగారూ! బాగా అర్థమైంది. కాని నా దొక్కమాట. కొన్ని కొన్ని సన్నివేశాలలో విశ్లేషించవలసిన అవసరం ఉండి తీరుతుంది. అప్పుడు కూడా 'పాఠకులు పాపం చాలా బలహీనులు, చదవలేరు' అని వాళ్ల తరపున మనమే వకాల్తా పుచ్చుకుని రాయడం మానేస్తే మన రచనలో సమగ్రత లోపిస్తుందే! అది రచయిత అసమర్థతగా కనిపించదంటారా?" అని ప్రశ్నించాను.

"ఏంటోయ్ గంగాధరం, నీ పిచ్చి? ప్రస్తుతం సక్సెస్‌ఫుల్ రైటర్స్‌గా పేరు గడించిన వాళ్ల ట్రెండ్స్ ఏవిటో గ్రహించు. వాళ్లని ఫాలో చెయ్యి. చాలు. రచయితగా ను వ్వాశించే గమ్యం చేరువైపోతుంది త్వరలో. చెపుతున్నానని ఏమీ అనుకోకుండా కథని తిరగ రాయి. మంచి కథ అవుతుంది" అన్నాడు నంజుండయ్య.

"ప్రయత్నిస్తాను గురూగారూ!" అంటూ లేచి సెలవు తీసుకుని బైట పడ్డాను.


## నాటి కథ:-

ఎంతో ప్రేమగా, సలహా చెప్పిన ఆసామీల మీద ఎంతో నమ్మకంతో రైతూ, అతని కొడుకూ ఆ గాడిద శ్రేష్ఠాన్ని మోసుకుంటూ వురోగా మిన్న స్నారు నంతకి. ధర బాగా పలికేందుకు శ్రమిస్తున్నామనే భావం వాళ్లకి కొత్త శక్తి ఇస్తున్నది. ఈ పర్యాయం ఎదురైన వాళ్లు చాలామంది వీళ్లని చూసి పగలబడి నవ్వారు.

"ఎక్కడో వెర్రి వెంగళప్పల్లా ఉన్నారా తండ్రీ మీరు! మిమ్మల్ని మొయ్యాల్సిన గాడిదని మీరు మొయ్యడం ఏవిట్రా?" అని వెక్కిరించారు.

"మీరంతా అలా అంటారని మాకు తెలుసు.






ఎంత ఎక్కువ శ్రమ పడితే అంత ఎక్కువ ఫలితం అని పెద్దలంటారు" అన్నారు వాళ్లు. ఆ తరువాత అవతలి వాళ్లు ఏమంటున్నారో వినిపించుకోకుండా సాగిపోతున్నారు.

## నేటి కథ :-

ఎస్సెమ్‌రావు గారూ, నంజుండయ్య గారూ కొత్త కొత్త సలహాలతో సరికొత్త ఊపందించడంతో నా ఆలోచనలు వీరస్పీడులో పరిగెట్టడం మొదలెట్టాయి. అయినప్పటికీ నా అనుమానాలు నాకున్నాయి. పాఠకులు ఏవి చదువుతారో, ఏవి చదవరో ఖచ్చితంగా తెలుసుకోడం ఎలా? ఎస్సెమ్ రావుగారు చెప్పిన దానికీ, నంజుండయ్యగారు చెప్పిన దానికీ ఎంతో తేడా కనిపిస్తున్నప్పుడు, పాఠకుల్లో మాత్రం ఆ తేడాలుండవా? ఎవరి టేస్ట్ వారిదే గదా! అందరి టేస్టుల్నీ తృప్తి పరిచేట్టు రాయడం ఎవరి వశం?

ఇలా ప్రశ్నలు, ఏవో జవాబులు! పరంపరగా సాగిపోతోంది మెదడులో ఈ సంఘర్షణ. బుర్ర వేడెక్కి పోయింది.

'అసలు ఈ అనవసరమైన అన్వేషణ మాని, రచయితగా నిన్ను నువ్వు సమాధాన పరుచుకోవోయ్ ముందు!' అంటూ గద్దించాడు లోపల్నుంచి అంతరాత్మడు. నాకూ అదే మంచిదనిపించింది. అనిపించిన వెంటనే ఎన్నాళ్లుగానో రాయాలనుకుంటున్న ఓ చిన్న కథ ఏకబిగిని రాసేసి, మళ్ళీ మళ్లీ చదువుకున్నాను. నా మట్టుకు నాకు తృప్తి కలిగింది.

అయితే ఈ మారు ఈ కథ మీద అభిప్రాయం చెప్పాల్సిన వ్యక్తి ధరణీధరం ఒక్కడే అనిపించింది.

ధరణీధరం ప్రఖ్యాత 'మాగాలెస్టార్ఫ్ వోంధీ నివినిస్టు' మేధావి. మార్క్సు నుండి గాంధీ దాకా సిద్ధాంతవేత్తలందర్నీ ఆమూలాగ్రం జీర్ణించుకున్నవాడు. సాహిత్యకారుడుగా, కథా రచయితగా, క్రిటిక్‌గా విరాజిల్లుతున్న ప్రముఖుడు. ఎప్పుడూ బిజీగానే ఉంటాడు. అంచాతను ముందుగానే అపాయింట్‌మెంట్ తీసుకుని, ఆ టైముకి ఠంచనుగా వెళ్లి కలిశాను.

ఆయన లోపల్నుంచి వచ్చే లోపల, మరోమారు కథంతా మననం చేసుకున్నాను, ఎందుకైనా మంచిదని. కథంతా విన్నాక రకరకాల ప్రశ్నలు వెయ్యడం ధరణీధరం అలవాటని కొందరు రచయిత మిత్రులు నాతో ఇదివరకే చెప్పడమే అందుకు కారణం.

- ఒక సిటీ బస్సు కిక్కిరిసిన జనంతో ఓ స్టాపులో ఆగింది. ఎక్కేవాళ్లు ఎక్కుతూ ఉండటం, దిగేవాళ్లు దిగుతూండటంతో గేటు దగ్గిర లొడలొక్కిడిగా తయారైంది. చొక్కాలు నలగడమో, చిరగడమో, పంచెలు ఊడటమో, మురికి అవడమో,... మొత్తం మీద జనం ఎక్కారు. బస్సు కదిలింది. కొంత దూరం వెళ్లాక ఓ పంచె కట్టాయన లబోదిబో మన్నాడు-రొండిన పెట్టుకున్న డబ్బు పొట్లం బస్సులో పడిపోయిందని. బస్సాగింది. తలా ఒక మాటా అన్నారు జనం. ఏతావాతా తేల్చిందేమిటంటే బస్సునీ, బస్సులో ఉన్న వాళ్లనీ వెదకాలని. ఎవరూ వ్యతిరేకించలా! ఎందుకంటే పోయిన సొమ్ము పదీ పరకా కాదు. పదిహేను వందలు. అన్నీ వంద కాగితాలు. ముచ్చిరేకు కాగితంలో చుట్టి, రొండిన పెట్టుకున్నాడు పంచె కట్టాయన. వెతుకులాట పావుగంటలో ముగిసింది కాని పొట్లం మాత్రం కనిపించలేదు. బస్సు బైలు దేరింది. పై స్టాపులో, పల్లెటూళ్లో బండి తోలుకు బతుకుతూ, పట్నంలో ఉన్న చుట్టాలింటికి వచ్చిన అప్పన్న కంగారుగా దిగేసి, ఓ సందులోకి నడిచి పోయాడు. అతని వెనకే రోజుకూలీ పనివాళ్ల సంఘం సెక్రెటరీ వీర్రాజు దిగి అప్పన్నని అనుసరించాడు. అప్పన్న ఆ సందులో ఓ ఇంటి గోడ చాటున ఆగి, చేతులో ఉన్న కారియర్ మూత తెరిచాడు. అన్నంలో చెయ్యిపెట్టి, అడుగునుండి ముచ్చిరేకు కాగితం పొట్లం పైకి లాగేడు. అన్నంలో చెయ్యిపెట్టి ఎవరూ వెతకరనే ధైర్యంతో, దొరికిన పొట్లం అక్కడ దాచాడు. సరిగ్గా అతగాడు పొట్లం పైకి లాగే క్షణానికిక్షివీర్రాజు వచ్చి, అప్పన్న చెయ్యి పట్టుకుని పోలీసులకి అప్పచెబుతానని బెదిరించాడు. దొంగతనం చెయ్యలేదనీ, దొరికిందనీ చెప్పుకుని పొట్లం వీర్రాజు చేతికిచ్చి బతుకుజీవుడా అని అప్పన్న వెళ్లిపోయాడు. నెల రోజుల గ్రాసం దొరికినందుకు పొంగిపోయి, బాకీ తీర్చడానికి కిరాణా కొట్టుకి బయల్దేరాడు వీర్రాజు -

"నాన్సెన్స్! అంతా ట్రాష్ ఎవరేం చెప్పినా సరే, గంగాధరం! సమాజంలో ఉన్న వర్గాలు రెండే! ఉన్నవాడు, లేనివాడు. ఒకటి దోపిడీ వర్గం. రెండోది దోపిడికి గురయ్యే వర్గం. దోపిడీ, దౌర్జన్యం చేసి పైకెదగడం ఉన్నవాళ్ల వర్గ లక్షణం. ఇది చారిత్రక సత్యం. కాని నీ కథలో ఉన్నది లేనివాడు లేనివాణ్ణే దోచుకోవడం. సిద్ధాంతం పునాదులకే ఎసరు పెడుతున్నావ్! చాలా అన్యాయం" అన్నాడు ధరణీధరం చాలా ఆవేశంగా.

"క్షమించండి గురూగారూ! నాకే సిద్ధాంతాలూ వగైరా బొత్తిగా తెలీవు! మీరంటున్న వర్గాలలో ఏ మనిషి ఏ వర్గానికి చెందిన వాడైనా పరిస్థితులకు తలవంచి తీరతాడు. ఆకలి, దరిద్రం, అవసరం ఏ మనిషినైనా సరే లొంగదీస్తాయి. మంచినీ, మానవత్వాన్నీ నిద్రపుచ్చి, బలవంతాన తప్పు చేయిస్తాయి. నే నీ కథని సిద్ధాంతం కోసమో, వర్గ ప్రయోజనాల కోసమో, లేదా వాటిని తెగనాడడం కోసమో రాయలేదు సార్! టోటల్‌గా మనిషి గురించే రాశాను. వాడిని అంత బలహీనుణ్ణి చేస్తున్న సామాజిక స్థితిగతుల గురించి రాశాను" అన్నాను.

"కావచ్చు గంగాధరం! నీ ఆలోచన అదే కావచ్చు. కాని అది కాగితం మీదికి ఎక్కేసరికి వేరేరకంగా, రెండో రకం వర్గాన్ని కించపరిచేట్లుగా

## మాలతీ చందూర్‌కు పురస్కారం



**1996**వ సంవత్సరానికి శ్రీ రాజాలక్ష్మి ఫౌండేషన్ వారి సాహిత్య పురస్కారం ప్రముఖ రచయిత్రి శ్రీమతి మాలతీ చందూర్‌కు లభించింది. ఈ పురస్కారం కింద రు. 15,000, ప్రశంసాపత్రం ఇస్తారు. దీనితో పాటు మాన్-మాప్ అవార్డు కింద మరో రు. 10,000, అమెరికావాసి శ్రీ కలసపూడి శ్రీనివాసరావు అందించే మరో రు.5,000 శ్రీమతి మాలతీ చందూర్‌కు లభిస్తాయి.

శ్రీ రాజాలక్ష్మి ఫౌండేషన్ అందించే మరొక పురస్కారానికి ప్రముఖ దౌత్యవేత్త, విశిష్ట పరిపాలనా దక్షుడు డా. ఆబిద్ హుస్సేన్‌ను ఎంపిక చేశారు. ఆయనకు రు. 50,000 నగదుతో పాటగు ప్రశంసా పత్రమూ ఇస్తారు.



రానున్న నవంబరు 19న మద్రాసులో జరిగే ఒక సభలో ఈ పురస్కారాలను వారికి అందజేస్తారు.

---

తయారైంది. ఇది పద్ధతి కాదు" అంటూ ధరణీధర్ సమాజంలోని వర్గాలూ, వర్గ స్వభావాలూ, విప్లవాల పుట్టుక, వ్యవస్థలు కూలడం, కొత్తవి పుట్టడం, ఎలా కూల్తాయో, ఎలా పుడతాయో ఇత్యాది అంశాలమీద సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చాడు. చదవమని కొన్ని పుస్తకాలు కూడా ఇచ్చాడు.

"నువ్వు బాగా రాయగలవు గంగాధరం! కాని ఏం రాయాలో, ఏం రాయకూడదో ముందుగా ఓ కమిట్‌మెంట్ అంటూ ఉండాలి. అది తెలియాలంటే ఈ పుస్తకాలు చదువు" అన్నాడు ధరణీధరం.

"తప్పకుండా గురూగారూ! సెలవు. మళ్లీ కలుస్తాను" అని లేచాను.

"వెల్‌కమ్!" అన్నాడు ధరణీధరం, చెయ్యి కలుపుతూ.

### నాటి కథ :-

*సంత జరిగే ఊరు సమీపించింది. ఆ ఊరు పక్కగా ఒక నది. ఆ నదిమీద ఒక వంతెన. వంతెన దాటితే గమ్యం చేరిపోయినట్టే. శక్తులన్నీ కూడదీసుకుని వంతెన దాటుతున్నారు గాడిదని మోస్తూ రైతూ, అతని కొడుకూ. ఇంతలో ఒక వ్యక్తి ఎదురొచ్చి గాడిదనీ, దాన్ని మోస్తున్న వాళ్లనీ పరిశీలించి చూసి, "చచ్చిన గాడిదని మోసుకు పోతున్నారేవిఁటయ్యా?" అన్నాడు. కొడుక్కి అనుమానం వచ్చి, గాడిదని పరీక్షగా చూశాడు. దాని గుడ్లు పక్కకి పోయి ఉన్నాయి. తండ్రితో అన్నాడు-చచ్చిందయ్యా- అని. చచ్చిన గాడిదని సంతకి తీసుకుపోవడం వృధా అని, దాన్ని నదిలోకి తోసేసి నిరాశగా వెనుదిరిగారు రైతూ అతని కొడుకూ.*

### నేటి కథ :-

టీ కప్పు అందించి నా ఎదురుగా కుర్చీలో కూర్చుంది పార్వతి. ఆమె ముఖంలో కించిత్తు గాంభీర్యం కనిపిస్తోంది.

"మీ గురుతుల్యులందరూ మీ కథల గురించి ఏం చెప్పారో మీరు వివరంగా నాకు చెప్పిన తరవాత మీ కథలు నేను మళ్లీ మళ్లీ చదివాను, మహాశయా! నాకు నచ్చాయి. నేను మీ అందరిలాగా మేధావినీ, రచయిత్రినీ కాను. క్రిటికల్ ఎనాలిసిస్‌లూ ఇవ్వలేను. నా అభిప్రాయాన్ని నా భాషలో చెప్పాలంటే, మీదొక ప్రత్యేకమైన విధానం. అది మీ సొంతం. మీ విషయంలోనే కాదు. గొప్పవాళ్లని అనుకరిస్తూ పేరు గడిస్తున్న వాళ్లని వదిలెయ్యండి, మిగిలిన రచయితలు చాలా మందికి ఎవరి శైలి వాళ్లకుంది. ఎవరి శిల్పం వారిది. ఎవరి ఎక్స్‌ప్రెషన్ వాళ్లది. థియరిస్ట్‌లూ, టెక్నికల్ స్పెషలిస్టులూ ఈ శైలీ, శిల్పాలకీ, వస్తువులకీ పరిధులు పెట్టొచ్చు. శాసనాలు చెయ్యొచ్చు. జరుగుతున్న సంఘటనలకి స్పందించే తత్వానికీ, ఆలోచనా ప్రవంతికీ, ఆవేశాలకీ, ఉద్వేగాలకీ ఏ నిబంధనలు పెట్టగలరు ఎవరు మాత్రం? శిఖరాగ్రం నుంచి ఉధృతంగా దొర్లే ఝురీ ప్రవాహానికి మార్గం నిర్దేశించడం ఎవరి తరం? ఒకవేళ ఎవరేనా నిర్దేశించినా, అది ఆ మార్గాన్నే రావాలని లేదు. వస్తుందనీ ఎవరు ఖచ్చితంగా చెప్పగలరు?" అని ఆగింది పార్వతి.

నా చెవుల్ని నేనే నమ్మలేకపోతున్నాను. పార్వతి ఇంత లోతుగా ఆలోచించగలదన్న విషయం మొదటిసారిగా తెలుసుకుని, ఇన్నేళ్లూ ఆ సత్యాన్ని గుర్తించలేక పోయినందుకు లోలోపలే సిగ్గు పడ్డాను.

"నడిరోడ్డుమీద జరిగిన ఒక సంఘటనని ఒకేసారి చూసిన రచయితలు దాన్ని ఆధారం చేసుకుని రాసిన పది కథల్లోనూ పది కోణాలూ, పది రకాల శైలీ, శిల్పాలూ! ఈ వైరుధ్యం ఎలా వస్తుంది? వాళ్ల దృక్పథాలలో తేడా ఉంటుంది. వారి వారి అనుభవాల్లోంచి పుట్టే ఆలోచన్లు, స్పందనల్లో ఉండే హెచ్చు తగ్గులు, ఆదర్శాలో, సిద్ధాంతాలో - వాటిపట్ల కమిట్‌మెంట్లు కారణాలై ఉండాలి అని నాకు అనిపిస్తుంది. ఏ సంకెళ్లూ పడని స్థితిలో విజన్ చేసే మేధస్సు సృజనకి జీవం. రసమయ సృష్టికి బలమైన పునాది. కాకపోతే సంఘానికి అతీతంగా కాక, మనుషుల మధ్య మనిషిగా, నేలమీద నడవ గలిగిన రచయిత నుండి మంచి రచన పుడుతుంది. ఏ రచయిత కైనా సరే, సొంత గొంతు అవసరం, స్వామీ! మీ పాఠకురాలిగా చెబుతున్నాను. మీ గొంతు మీ సొంతం. దాన్ని సక్రమంగా వాడుకోండి. రచయితలకి గురువులు ఉండరు, సార్! అనుభవాలే గురువులు. బాగా రాస్తున్నారు మీరు. ఇంకా బాగా, గొప్పగా రాయగలరు. తిలక్ ఎక్కడో అన్నట్లు 'కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి. విస్తరించాలి చైతన్య పరిధి. అగ్ని జల్లినా, అమృతం కురిసినా అందం, ఆనందం దాని పరమావధి!' అనే మాట మర్చిపోకండి!" అంది పార్వతి.

ఆనందం పట్టలేక పార్వతిని దగ్గిరికి తీసుకున్నాను.